క్లుప్తంగా

నేడు వెన్నాచేడ్‌లో టీబీ క్యాంపు

గండేడ్‌: మండలంలోని వెన్నాచేడ్‌లో శుక్రవారం టీబీ క్యాంపు నిర్వహించనున్నట్లు మెడికల్‌ ఆఫీసర్‌ చంద్రశేఖర్‌ తెలిపారు. ఉదయం 9గంటలకు సబ్‌సెంటర్‌ వద్ద ఈ క్యాంపు ఉంటుందని, ఎక్స్‌రే సైతం అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. 2017వ సంవత్సరం నుంచి 2023 మధ్య టీబీ మందులు తిని నయమైన వారితో పాటు నయం కాని వారు రావాలని సూచించారు.

9రోజుల పాటు గణేష్‌ ఉత్సవాలు

జడ్చర్ల: పట్టణంలో ఈ ఏడాది గణేష్‌ ఉత్సవాలను తొమ్మిది రోజులు నిర్వహించాలని నిర్ణయించినట్లు వీహెచ్‌పీ సభ్యులు శ్యామ్‌, జగ్‌పాల్‌రెడ్డి తెలిపారు. గురువారం సమావేశమై నిర్ణయం తీసుకున్నట్లు, ఇందుకు మండపాల నిర్వాహకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జడ్చర్ల: మండలంలోని పెద్ద ఆదిరాల రామస్వామిగుట్ట తండాకు చెందిన మార్కెట్‌ కమిటీ మాజీ డైరెక్టర్‌ హిర్యానాయక్‌ మృతిపై మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గురువారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వాల్యానాయక్‌, యాదయ్య, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

దేవరకద్ర: కౌకుంట్ల మండలానికి సంబంధించిన పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డితో కలిసి మండల నాయకులు కలెక్టర్‌ విజయేంద్ర బోయికి వినతిపత్రం ఇచ్చారు. కొత్తగా ఏర్పడిన మండలంలో చాలా సమస్యలు ఉన్నాయని అందులో అధికారికంగా చేపట్టే సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో అరవింద్‌ రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బెల్లం విక్రయాల వివరాలు ఇవ్వండి

జడ్చర్ల: కిరాణ దుకాణాలలో బెల్లం విక్రయాల పూర్తి వివరాలను అందుబాటులో ఉంచాలని, తనిఖీలకు వచ్చిన సమయంలో తమకు చూపించాల్సి ఉంటుందని స్థానిక ఎక్సైజ్‌ శాఖ సీఐ విప్లవరెడ్డి దుకాణాల యజమానులకు నోటీసులు జారీ చేశారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు బెల్లం అమ్మేందుకు అనుమతిస్తూ కొనుగోలు చేసిన వ్యక్తి సెల్‌ నంబర్‌, పూర్తి వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. వ్యక్తికి ఒకసారి 10 కిలోలకు మించి విక్రయించరాదని, దుకాణంలో వంద కిలోలకు మించి నిల్వ ఉంచరాదని నోటీసులో పేర్కొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

నవాబుపేట: మండలంలోని వీరశెట్టిపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఆశ్రయ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో బ్యాగులు, షూస్‌, నోట్‌బుక్స్‌ అందించారు. కార్యక్రమంలో గోపినాథ్‌, రాజవర్ధన్‌, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

మిడ్జిల్‌: మండలంలోని కొత్తపల్లి, మల్లాపూర్‌ ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఎంఈఓ మంజులాదేవి తనిఖీ చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ఆమె వెంట కాంప్లెక్స్‌ హెచ్‌ఎం సరస్వతిదేవి ఉన్నారు.

ఎస్వీడీసీలో డిగ్రీ తరగతుల ప్రారంభం

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని ఎస్వీడీసీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈమేరకు విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి పీయూ కంట్రోలర్‌ రాజ్‌కుమార్‌ హాజరయ్యారు. విద్యార్థులు కమ్యూనికేషన్‌ స్కిల్స్‌పై అవగాహన కలిగి ఉండాలని, వాటి ద్వారా సాఫ్ట్‌వేర్‌ కంపెనీల్లో సైతం ఉద్యోగ అవకాశాలు పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్‌ ఖలీల్‌, ప్రిన్సిపాల్‌ కుమారస్వామి, వైస్‌ ప్రిన్సిపాల్‌ రాజేశ్వరి, అకాడమిక్‌ డీన్‌ హీరోజీ రావ్‌ బోస్లే తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్‌ వితరణ

గండేడ్‌: మండల కేంద్రంలోని బాలుర జెడ్పీహెచ్‌ పాఠశాలలో చదువుకున్న 1995–96 చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాలకు గురువారం ప్రింటర్‌ను సొంత డబ్బులతో కొనుగోలు చేసి గురువారం ఇన్‌చార్జ్‌ హెచ్‌ఎం జనార్దన్‌కు అందజేశారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌, కృష్ణారెడ్డి, అనంతరమణాచారి, శాంతయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

పార్టీకి తీరని లోటు

చిన్నచింతకుంట: సీపీఐ మాస్‌లైన్‌ ప్రజాపంథా కేంద్ర కంట్రోల్‌ కమిషన్‌ చైర్మన్‌ రాయల చంద్రశేఖర్‌ అకాల మరణం పార్టీకి తీరని లోటని మండల కార్యదర్శి దేవదానం, ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి గణేష్‌ అన్నారు. గురువారం మండల కేంద్రంలో రాయల చంద్రశేఖర్‌ చిత్రపటానికి నివాళి అర్పించారు. రాయల చంద్రశేఖర్‌ బుధవారం అకాల మరణం పొందడం బాధాకరమన్నారు.


కాకార్జాలతండాలో సీఎం రేవంత్‌రెడ్డి పోస్టర్‌కు పాలాభిషేకం చేస్తున్న గిరిజన రైతులు


మిడ్జిల్‌లో..


మహమ్మదాబాద్‌లో..


దేవరకద్రలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు

రుణమాఫీ దేశానికే ఆదర్శం

సాక్షి నెట్‌వర్క్‌: ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా రైతుల రుణాలను ఏకకాలంలో మాఫీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండల కేంద్రంలో అడ్డాకుల, భూత్పూర్‌, మూసాపేట మండలాలకు చెందిన రైతులు, నాయకులతో కలిసి గురువారం సాయంత్రం రుణమాఫీ సంబరాలను నిర్వహించారు. రైతు వేదికలో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే పాల్గొని సీఎం ప్రసంగాన్ని తిలకించారు. అనంతరం 44వ నంబర్‌ జాతీయ రహదారిపై వేముల స్టేజీ నుంచి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లతో భారీ ర్యాలీ చేపట్టారు.


మూసాపేట వద్ద ర్యాలీలో దేవకరద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

- నవాబుపేట మండల కేంద్రంలోని అంబేడ్కర్‌ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జహీర్‌, బంగ్లరవి, రాంచంద్రయ్య, వాసుయాదవ్‌, రాజేష్‌, నవాజ్‌రెడ్డి, కుమార్‌, శర్మ, శ్రీనివాస్‌, పాల్గొన్నారు. మొదటి విడతలో రూ.లక్ష వరకు 3,159 మంది రైతులకు రుణమాఫీ లభించిందని మండల వ్యవసాయ అధికారి కృష్ణకిషోర్‌ తెలిపారు.
- జడ్చర్ల అంబేడ్కర్‌ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, మినాజ్‌, నాయకులు పాల్గొన్నారు.
- భూత్పూర్‌ మున్సిపాలిటీతో పాటు మండలంలోని 2,704 మంది రైతులకు రుణమాఫీ అయ్యింది. రైతు వేదికలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని టీవీ ద్వారా రైతులు వీక్షించారు.
- రైతు రుణమాఫీ సంబరాల్లో భాగంగా మహమ్మదాబాద్‌ మండల కేంద్రంలో రైతు వేదిక నుంచి ర్యాలీ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కమతం విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, శాంతీబాయి, రాధారెడ్డి, చెన్నయ్య, నారాయణ, బాల్‌రాజ్‌, వెంట్రాములు పాల్గొన్నారు.
- మిడ్జిల్‌ మండల కేంద్రంలో కాంగ్రెస్‌ పార్టీ ఆధ్వర్యంలో బస్టాండ్‌ వద్ద ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, సాయిలు, గౌస్‌, వెంకటయ్య, మల్లికార్జున్‌రెడ్డి, విజయ్‌, వెంకటేష్‌గౌడ్‌, అశోక్‌, జహంగీర్‌, పర్వతాలు, రాంగౌడ్‌, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- అడ్డాకుల, మూసాపేట మండలాల్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్‌ నాయకులు క్షీరాభిషేకం చేశారు.
- దేవరకద్ర, కౌకుంట్ల మండలాల్లోని ఊరురా రైతు రుణమాఫీ సంబరాలు మిన్నంటాయి. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్‌ నాయకులు, పలువురు రైతులు పాలాభిషేకం నిర్వహించారు. కౌకుంట్ల మండల కేంద్రంలో పెద్ద ఎత్తున నాయకులు, రైతులు రోడ్డుపైకి వచ్చి నినాదాలు చేశారు. రైతు వేదికలో సాయంత్రం రుణమాఫీని ప్రారంభించే కార్యక్రమాన్ని టీవీలో వీక్షించారు. కార్యక్రమంలో అరవింద్‌రెడ్డి, కిషన్‌రావు, అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, ఆదిహన్మంతరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, కోనరాజశేఖర్‌, కుర్మయ్య, గోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.
- కోయిల్‌కొండ మండల కేంద్రంలోని చౌరస్తాలో సంబరాలు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాజారఘుపతిరెడ్డి, జగన్‌, రవినాయక్‌, సత్యపాల్‌రెడ్డి, మల్లికార్జున్‌గౌడ్‌, రామునాయక్‌, గౌస్‌, శేఖర్‌, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.
- చిన్నచింతకుంట మండల కేంద్రంలో రైతులతో కలిసి సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్‌ కృష్ణయ్య, మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్న, తదితరులు ఉన్నారు.
- ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుని రైతుల కల సాకారం చేసిందని పీసీసీ మెంబర్‌ నర్సింహరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లారెడ్డి, మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. గండేడ్‌ మండలంలోని పెద్దవార్వాల్‌ రైతువేదికలో రైతు రుణమాఫీ సంబరాలు నిర్వహించారు. అనంతరం బైక్‌ ర్యాలీ చేపట్టారు. స్పెషల్‌ ఆఫీసర్‌ పాండు, మాజీ ఎంపీటీసీ బాలయ్య, మాజీ సర్పంచ్‌ ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.


భూత్పూర్‌ రైతువేదికలో సీఎం ప్రసంగాన్ని వీక్షిస్తున్న అధికారులు, రైతులు


కోయిల్‌కొండలో..


హన్వాదలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న రైతులు

‘బీఆర్‌ఎస్‌ నాయకులు ఇకనైనా మారండి’

హన్వాద: ‘ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తూ.. ప్రజల్లో లేనిపోని అపోహలు కల్పిస్తున్న బీఆర్‌ఎస్‌ నాయకులు ఇకనైనా మారండి’ అని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం హన్వాడ, టంకరలో నిర్వహించిన రైతు సంబరాల కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రకటించిన మేరకు రైతు రుణమాఫీని అమలు చేశామన్నారు. బీఆర్‌ఎస్‌ నాయకులు ముఖ్యంగా కేటీఆర్‌, హరీశ్‌రావుకు కాంగ్రెస్‌ ప్రభుత్వం వచ్చిన మొదటిరోజు నుంచే హామీల అమలు ఎక్కడ అంటూ సన్నాయి రాగాలు తీశారని విమర్శించారు. పదేళ్లలో రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసి.. నెలకు రూ.7 వేల కోట్ల వడ్డీ కట్టేలా చేసింది సరిపోదన్నట్లు హామీల అమలు గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీని కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రకటించి మొదటి విడతను బుధవారం అమలు చేసిందని, అలాగే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌, రూ.500కే గ్యాస్‌ సిలిండర్‌ అమలు చేస్తున్నామన్నారు. ఇంకా బీఆర్‌ఎస్‌ నాయకులు సొల్లు కబుర్లు చెప్పుకొంటూ పోతే ప్రజలే తరమికొట్టే రోజుల వస్తాయని హెచ్చరించారు. అంతకుముందు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మండలకేంద్రంలో నాయకులు, కార్యకర్తలతో కలసి భారీ బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేను స్థానికులు ఘనంగా సత్కరించి సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ మోహన్‌రావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్‌, ఎన్పీ వెంకటేష్‌, పార్టీ మండలాధ్యక్షుడు మహేందర్‌, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, నాయకులు బెక్కరి అనిత, సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, నవనీత, కృష్ణయ్య, యాదిరెడ్డి, రఘుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం బస్సు నడపండి


డీఎంకు వినతిపత్రం ఇస్తున్న చిన్నరాజమూర్‌ గ్రామస్తులు

దేవరకద్ర: మండల కేంద్రం నుంచి చిన్నరాజమూర్‌, కోయిల్‌సాగర్‌ వెళ్లేందుకు విద్యార్థుల బస్సు నడపాలని కోరుతూ గురువారం మహబూబ్‌నగర్‌ డీఎం సుజాతకు చిన్నరాజమూర్‌ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. గ్రామం నుంచి చదువుకునేందుకు కోయిల్‌సాగర్‌, దేవరకద్రకు నిత్యం వందలాది మంది విద్యార్థులు వెళ్తుంటారని వారు తెలిపారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో చాలా మంది విద్యార్థులు నడిచి కోయిల్‌సాగర్‌ వెళ్తున్నారని, ఇక దేవరకద్రకు ఆటోలలో వెళ్తున్నట్లు తెలిపారు. కోయిల్‌సాగర్‌ రూట్‌లో పది గ్రామాలకు కలిపి విద్యార్థుల బస్సును నడపాలని కోరారు. దీనికి డీఎం స్పందించి త్వరలో బస్సును నడుపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భరత్‌, ప్రేమ్‌కుమార్‌, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో కూడిన విద్య


మోనప్పగుట్టలో అమ్మమాట- అంగన్‌వాడీ బాట ర్యాలీ

మహబూబ్‌నగర్‌ రూరల్‌: చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య ఎంతో కీలకమని, వారికి ఆటపాటలతో కూడిన విద్యను అందించడమే లక్ష్యమని ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ వసీమ్‌ సుల్తానా అన్నారు. గురువారం పట్టణంలోని శివశక్తినగర్‌, మోనప్పగుట్ట వార్డులలో అమ్మమాట– అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. మహిళా శక్తి జిల్లా కోఆర్డినేటర్‌ అరుణ, రక్షిత, అంగన్‌వాడీ టీచర్లు సంగీత, ప్రశాంతి, అనిత, సృజన, యశోద, హేమలత, సువర్ణలత పాల్గొన్నారు.

జడ్చర్ల టౌన్‌: కావేరమ్మపేట సెక్టార్‌లోని ఇందిరానగర్‌ అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారుల తల్లులతో సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్‌ సీడీపీఓ మెహరున్నీసాబేగం మాట్లాడుతూ రెండున్నరేళ్లు దాటిన చిన్నారులందరిని అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని తల్లులను కోరారు. కేంద్రంలో ఆటపాటల ద్వారా పూర్వప్రాథమిక విద్యను అందించటం జరుగుతుందని, తద్వారా చిన్నారుల మానసిక ఎదుగుదలకు తోడ్పడుతుందన్నారు. కేంద్రంలో చిన్నారులకు పోషకాహారం, బాలామృతం ప్లస్‌ అందిస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ సుగుణ, పాఠశాల హెచ్‌ఎం చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు అంజనమ్మ, అంజలి, విజయకుమారి, యాదమ్మ, సరోజ పాల్గొన్నారు.

దుకాణాలు ఖాళీ చేయండి

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: అద్దె చెల్లించకుండా అక్రమంగా వ్యాపారాలు చేసుకుంటున్న వారు మున్సిపాలిటీ దుకాణాలను వెంటనే ఖాళీ చేయాలని కమిషనర్‌ డి.మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 42వ వార్డు గాంధీనగర్‌లో సుమారు ఐదేళ్ల క్రితం రూ.30 లక్షల మెప్మా నిధులతో షాపింగ్‌ కాంప్లెక్స్‌ నిర్మించారు. అందులోని గ్రౌండ్‌ ఫ్లోర్‌లో రెండేసి పెద్ద, చిన్న షాపులు మొత్తం నాలుగు ఉన్నాయి. అలాగే పై అంతస్తులో కమ్యూనిటీ హాల్‌ ఏర్పాటు చేశారు. కాగా, కింద నిర్మించిన రెండు పెద్ద షాపులను వీధి వ్యాపారులకు ఉచితంగా కేటాయించినా ప్రస్తుతం వేరే వ్యక్తులు ఇతర వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. గతంలో కౌన్సిల్‌ సమావేశంలోనూ వాటి అద్దెల విషయమై కొందరు కౌన్సిలర్లు ప్రస్తావించారు. మున్సిపాలిటీకి ఎలాంటి అద్దె రాకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. చివరకు స్పందించిన మున్సిపల్‌ కమిషనర్‌ డి.మహేశ్వర్‌రెడ్డి, మెప్మా డీఎంసీ శివకుమార్‌తో కలిసి గురువారం సాయంత్రం అక్కడికి వెళ్లి తనిఖీ చేశారు. వీధి వ్యాపారులు కాకుండా ఒక పెద్ద షాపులో లేడీస్‌ కార్నర్‌, రెండో దానిలో మగ్గం పనికి సంబంధించిన లావాదేవీలు ఇతరులు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. వారం రోజుల్లో రెండు షాపులను ఖాళీ చేయాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలోనే వేలం పాట నిర్వహించి వీటి నుంచి అద్దె వసూలు చేయాలని నిర్ణయించారు.


గాంధీనగర్‌లోని మున్సిపల్‌ షాపింగ్‌ కాంప్లెక్స్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్‌ మహేశ్వర్‌రెడ్డి

బీసీ హాస్టల్‌కు భవనం కేటాయించాలి

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జిల్లా కేంద్రంలోని బాలికల బీసీ హాస్టల్‌కు భవనం కోసం పాత డీఈఓ కార్యాలయాన్ని కేటాయించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డికి ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో ఒకే బాలికల హాస్టల్‌ ఉందని, దానికి సొంత భవనం లేకపోవడం వల్ల విద్యార్థులు టీసీ తీసుకొని వెళ్లిపోతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రశాంత్‌, భరత్‌ తదితరులు పాల్గొన్నారు.

క్షయ నిర్ధారణ పరీక్షలు



భూత్పూర్‌: మండలంలోని కర్వెనలో గురువారం 180 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి దిలీప్‌కుమార్‌ తెలిపారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సబ్‌సెంటర్‌లో చేపట్టిన క్షయ నిర్ధారణ పరీక్షల్లో 171 మందికి ఎక్స్‌రేలు, 36 మంది శాంపిల్స్‌ సేకరించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ అయ్యుబ్‌ఖాన్‌, సిబ్బంది బాల్‌రాజ్‌, రాజు, ప్రమోద్‌ కుమార్‌, శ్రీనివాస్‌, దేప్లీ తదితరులు పాల్గొన్నారు.

ఏజీపీ కురుమయ్యకు సన్మానం



జెడ్పీసెంటర్‌(మహబూబ్‌నగర్‌): అసిస్టెంట్‌ గవర్నమెంట్‌ పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌గా నియమితులైన సీనియర్‌ న్యాయవాది కురుమయ్యను కార్యాలయంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. కార్యక్రమంలో కృష్ణ ముదిరాజ్‌, బాలగోపి, ఎర్రనర్సింహానాయుడు, సతీష్‌కుమార్‌, బండిమల్లేష్‌, శేఖర్‌, రవికుమార్‌, విజయ్‌కుమార్‌, నాగరాజు, జయరాం పాల్గొన్నారు.

సీఎం దృష్టికి తీసుకెళ్లండి

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యల పరిష్కారం కోసం సీఎంకు దృష్టికి తీసుకెళ్లాలని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌ ఫారుఖ్‌ హుస్సేన్‌ గురువారం వనపర్తిలో రాష్ట్ర ప్లానింగ్‌బోర్డు వైస్‌ చైర్మన్‌ చిన్నారెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా పెండింగ్‌ డీఏలు, పీఆర్‌సీ అమలు, హెల్త్‌కార్డుల జారీని వేగవంతం చేయాలని కోరారు. అదేవిధంగా దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న దాదాపు 20వేల పదోన్నతులు, 50వేల బదిలీలను అత్యంత పారదర్శకంగా నిర్వహించి ఉపాధ్యాయ లోకానికి చేసిన మేలు చిరస్థాయిగా నిలిచిపోతుందని తెలిపారు.

సంప్‌ను శుభ్రపరిచిన మున్సిపల్‌ సిబ్బంది

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: స్థానిక 14వ వార్డు పరిధిలోని ఎర్రమన్నగుట్టపై ఉన్న సంప్‌లో నుంచి కొన్ని రోజులుగా ఒండ్రుతో కూడిన తాగునీరు సరఫరా అవుతోందని స్థానికులు వాపోయారు. రెండు రోజులుగా ఇవి తాగిన సుమారు 15 మంది వాంతులు, విరేచనాలతో ఆస్పత్రుల పాలయ్యారని చెప్పారు. దీంతో గురువారం మున్సిపల్‌ ఇంజినీరింగ్‌ అధికారులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం సంప్‌ లోపలికి సిబ్బంది దిగి మొత్తం శుభ్రం చేశారు. అలాగే చుట్టుపక్కల చెత్తాచెదారంతో పాటు పిచ్చిమొక్కలను తొలగించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పైపుల ద్వారా తాగునీటిలో ఎక్కడైనా మట్టి రేణువులు కలిసి ఉండవచ్చని వారు చెబుతున్నారు.

‘ఉపాధి’లో అవకతవకలకు తావివ్వొద్దు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని మండల పరిషత్‌ కార్యాలయం వద్ద గురువారం ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహించారు. అడిషనల్‌ డీఆర్‌డీఓ ముషాహిదాబేగం, ఏపీడీలు శ్రీపాదరావు, మంజుల హాజరయ్యారు. 2023 ఏప్రిల్‌1 నుంచి 2024 మార్చి 31 వరకు మండల వ్యాప్తంగా సుమారు రూ.3.90కోట్ల పనులపై ఎస్‌ఆర్‌పీ శ్రీకాంత్‌ ఆధ్వర్యంలో తనిఖీ బృందం మండల వ్యాప్తంగా 350 పనులపై వారం రోజులుగా విచారణ చేపట్టి నివేదికలను రూపొందించింది. దీనిపై ప్రజావేదికలో బహిరంగ చర్చ చేపట్టారు. మస్టర్‌లో కొట్టివేతలు, చేసిన పనులకు సంబంధించిన కొలతల్లో తేడాలను తనిఖీ బృందం గురించి ఇచ్చిన నివేదికలపై అధికారులు విచారణ చేశారు. అవకతవకలకు పాల్పడిన బాధ్యులపై జరిమానా విధించారు. అదేవిధంగా రూ.33వేలను అధికారులు రికవరికి ఆదేశించినట్లు తెలిసింది. ఉపాధిహామీ పనుల్లో అవకతవలకు తావివ్వకుండా పనులను చేయించాలని ఉపాధి సిబ్బందికి అధికారులు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణయ్య, ఏపీఓ పులేందర్‌, కార్యదర్శులు, టీఏలు, ఎఫ్‌ఏలు తదితరులు ఉన్నారు.


మూసాపేటలో ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

జడ్చర్ల టౌన్‌: ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పీఏ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం అర్బన్‌హెల్త్‌ సెంటర్‌ డా. మనుప్రియను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్‌ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జీతాలు పెంచాలని సమ్మె చేస్తున్న సందర్భంగా ప్రస్తుత ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వస్తే సమస్యలు ఖచ్చితంగా తీరుస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ హామీని వెంటనే నిలబెట్టుకోవాలని, రూ.18వేల కనీస వేతనం, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఆరోగ్యశాఖమంత్రి, డీహెచ్‌ స్పందించకుండా ఉన్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. సత్తయ్య, సరోజ, నజీమా, షబాన, మంజుల, విజయ, భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మూసాపేట, అడ్డాకుల మండలాలకు చెందిన ఆశావర్కర్లు గురువారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వ ఎన్‌హెచ్‌ఎం స్కీంను రక్షించాలని, ఆశావర్కర్లను కార్మికులుగా గుర్తించి నెలకు రూ.26వేల కనీస వేతనం చెల్లించే విధంగా చూడాలని కోరారు. తమకు నష్టం కలిగించే పరీక్షలను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. 45వ ఐఎల్‌సీ సిఫారసులను అమలు చేయాలని, పీఎఫ్‌, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.


జడ్చర్లలో వినతిపత్రం సమర్పిస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశావర్కర్లు

ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి

మహబూబ్‌నగర్‌ ఎడ్యుకేషన్‌: జిల్లాలో యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో బాలుర జూనియర్‌ కళాశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన అప్రెంటీస్‌ మేళాకు ఆయన హాజరై ప్రసంగించారు. పదేళ్ల కాలంలో విద్యా, వైద్యం అన్ని రంగాల్లో అన్యాయం జరిగిందని, యువత నైపుణ్యాలకు అనుగుణంగా ప్రైవేట్‌ రంగంలో అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఇందులో భాగంగా పలువురికి నియామక పత్రాలు అందజేశారు.

రైల్వేస్టేషన్‌లో వృద్ధుడు మృతి

మహబూబ్‌నగర్‌ క్రైం: రైల్వే స్టేషన్‌లో ఓ వృద్ధుడు మృతి చెందాడు. రైల్వే ఎస్‌ఐ సయ్యద్‌ అక్బర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లాకేంద్రంలోని వీరన్నపేటకు చెందిన బసవలింగం(64) కుటుంబ సభ్యులు అందరూ హైదరాబాద్‌లో ఉన్నారు. అతను హైదరాబాద్‌ వెళ్లడానికి గురువారం మహబూబ్‌నగర్‌ స్టేషన్‌కు వచ్చి పడుకున్న చోటనే మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

అయోమయంలో రైతులు

జడ్చర్ల: మొదటి విడతగా రూ.లక్ష లోపు రుణమాఫీ చేయడంతో కొందరి పేర్లు జాబితాలో గల్లంతయ్యాయి. బాదేపల్లి సహకార బ్యాంకు పరిధిలో 756 మంది రైతులు రూ.లక్ష లోపు రుణాల పొందగా, వారిలో కేవలం 388 మందికి మాత్రమే జాబితాలో పేర్లు వచ్చాయి. అదేవిదంగా మిడ్జిల్‌ సహకారం సంఘం పరిధిలో చాలామంది రైతుల పేర్లు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు.